సైనిక్ స్కూల్ విద్యార్థి అదృశ్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కోరుకొండ సైనిక్ స్కూలులో 8వ తరగతి చదువుతున్న ఉత్కర్ష్ మోహన్ బనార్కర్ ఈనెల 19న విజయనగరం రైల్వేస్టేషన్‌లో అదృశ్యమయ్యాడని, అచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని రూరల్‌స్టేషన్ ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఉత్కర్ష్ సంక్రాంతి సెలవుల అనంతరం కోరుకొండ సైనిక్ స్కూలుకు వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి రైలులో వస్తూ మధ్యాహ్నం 1గంటకు విజయనగరం స్టేషన్‌లో దిగాడని తెలిపారు. పాఠశాలకు చేరకపోవడంతో స్కూలు యాజమాన్యం ఫిర్యాదు చేసిందని తెలిపారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకై 9121109441, 9121109427 సంప్రదించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నెలాఖరుకు రోడ్ల మరమ్మతులు పూర్తి

- ఉపాధి నిధులతో సాగునీటి కాలువల పనులు
- రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి
- వెనుకబడిన జిల్లా అనే ముద్రను పోగొడతాం
- ప్రభుత్వ శాఖల సమీక్షలో ఇన్ ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాపై వున్న వెనుకబాటుతనం ముద్రను చెరిపివేసే విధంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు అధికారులంతా పూర్తిస్థాయిలో తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర హోం మంత్రి, జిల్లా ఇన్ ఛార్జి మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఇన్ ఛార్జి మంత్రి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలతో కలసి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెలాఖరులోగా రోడ్ల మరమ్మతులు పూర్తికావాలని ఆదేశించారు. రోడ్లు, భవనాలవాఖ ఎస్ఇ కాంతిమతి మాట్లాడుతూ జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో గుంతలు లేని రహదారుల కార్యక్రమంలో మూడు విడతలుగా రూ.23.51 కోట్లతో జిల్లాలో 176 పనులు చేపట్టామన్నారు. ఇందులో 92 పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో 84 పనులు జరుగుతున్నాయని చెప్పారు. జనవరి నెలాఖరున జిల్లా వ్యాప్తంగా మరమ్మత్తులు పూర్తయిన రోడ్లన్నింటినీ ప్రారంభించే కార్యక్రమాన్ని చేపడతామని మంత్రి అనిత ప్రకటించారు.

జిల్లాలో ఎన్‌డిబి, సిఆర్ఎఫ్ తదితర నిధులతో చేపట్టిన పనుల పరిస్థితిని కూడా మంత్రి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై నిధులు విడుదల కాక నిలిచిపోయిన పనుల వివరాలపై ఆరా తీశారు. ఈ పనులకు నిధులు విడుదల చేయించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి వెల్లడించారు.పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధిహామీ మెటీరియల్ కాంపొనెంట్ పనులను పూర్తిచేసేందుకు ప్రయత్నించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 3008 పనులను రూ.228 కోట్లతో మంజూరు చేశామని, వీటిలో 1066 పనులు పూర్తయినట్టు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వివరించారు. దాదాపు 94 కిలోమీటర్ల సిసిరోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేశామని,ఈ పనులు పూర్తయిన వెంటనే మరో రూ.65 కోట్ల మేరకు పనులు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ వివరించారు. గ్రామాల్లో సాగునీటి కాల్వలు, ఫీడర్ ఛానళ్ల మరమ్మత్తులకు ఉపాధిహామీ నిధులు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సూచించారు. ఉపాధిహామీ కింద గ్రామీణ ప్రాంతాల్లో ఎస్.సి., ఎస్.టి. కుటుంబాలకు ఉపయోగపడేలా ఫిష్ పాండ్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టి ఉపాధి కల్పించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సూచించారు.

భూమిని గుర్తిస్తే పరిశ్రమలే ఏర్పాటు : మంత్రి కొండపల్లి

జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కనీసం 20 ఎకరాలకు తక్కువ లేకుండా తహశీల్దార్‌లు ప్రభుత్వ స్థలాన్ని గుర్తిస్తే ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఆర్ అండ్ బి రోడ్లకు ఆనుకొని వున్న స్థలాలను గుర్తిస్తే పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతారని పేర్కొన్నారు. వీలైతే 20 నుంచి 40 ఎకరాల వరకు భూమిని గుర్తించాలని, దీనిపై తనకు ఈ నెలాఖరు నాటికి నివేదికలు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఫ్రీ హోల్డు చేసిన భూములు, రెవిన్యూ శాఖ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై కలెక్టర్ అంబేద్కర్ వివరించారు. మ్యుటేషన్‌లపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి చెప్పారు. రెవిన్యూ శాఖకు సంబంధించిన భూసమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నందున తహశీల్దార్‌లు ఈ అంశంలో చిత్తశుద్ధితో పనిచేయాలని ఎం.పి కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు.సమావేశంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పాలవలస యశస్విని, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, ఆర్ అంబ్ బి ఎస్ఇ కాంతిమతి, పంచాయతీరాజ్ ఎస్ఇ శ్రీనివాస్, డ్వామా పీడీ శారదాదేవి, ఆర్.డి.ఓలు కీర్తి, రామ్మోహనరావు, సత్యవాణి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయ ఆధునీకరణకు చర్యలు

రామభద్రపురం మండలంలో ఆరు మాసాల పసిబిడ్డపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి ఐదు మాసాల్లో శిక్షపడేటట్లుగా చర్యలు చేపట్టిన ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మంత్రి అనిత అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. పోలీసు నియామక ప్రక్రియపై ఎస్‌పిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రతీ పోలీసు స్టేషనుకు డ్రోన్ ఆవశ్యకత ఉందని, త్వరలో 30 డ్రోన్స్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

10 నుంచి గుర్లలో ఫైలేరియా మాత్రల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఫైలేరియా నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 10 నుంచి 15 రోజులపాటు గుర్ల మండలంలో డిఇసి, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ శతశాతం జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. మైక్రో ఫైలేరియా కేసుల సంఖ్య గుర్ల మండలంలో ఎక్కువగా బయటపడటంతో, ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఆ మండలంలో చేపడుతున్నట్లు తెలిపారు. గుర్ల మండలంలో చేపట్టాల్సిన సామూహిక ఫైలేరియా మాత్రలమింగించే కార్యక్రమంపై కలెక్టరేట్లో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గుర్ల మండలంలో సుమారు 16వేల ఇళ్లు ఉన్నాయని, ప్రతీ ఇంటికీ ఫైలేరియా వ్యాధిపై ముద్రించిన స్టిక్కర్లను, కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. మండలంలో ఉన్న సుమారు 67వేల జనాభాలో, రెండేళ్ల లోపు పిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మినహా ప్రతీఒక్కరితోను డిఇసి, ఆల్బెండజోల్ మాత్రలను మింగించేలా ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, సచివాలయ, వైద్యారోగ్యశాఖ సిబ్బంది ద్వారా ఇంటింటికీ మాత్రల పంపిణీ జరగాలని చెప్పారు. మాత్రలు మింగించే రోజు, ముందు జాగ్రత్త చర్యగా వైద్య సిబ్బంది సాయంత్రం వరకు అక్కడే ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, జిల్లానుంచి ఫైలేరియాను తరిమికొట్టేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఓ జీవనరాణి, డిసిహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, డిటిఓ కె.రాణి, జిల్లా మలేరియా అధికారి మణి, డిఇఓ మాణిక్యం నాయుడు, సాంఘిక సంక్షేమాధికారి రామానందం, ఐసిడిఎస్ పీడీ సుధారాణి, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అపారిశుధ్యమే కారణం

మురుగు కాలువల్లో తాగునీటి పైపులైన్లు ● బిల్లలవలసకు పొంచి ఉన్న మరింత ముప్పు

గ్రామంలో చెత్తతో పూడికపోయిన కాలువ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బొండపల్లి మండలం బిల్లలవలసలో డయేరియా ప్రబలడానికి కారణం తీవ్ర అపారిశుధ్యం, కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారమే కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేల్కొనకపోతే ఆ గ్రామానికి మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. గ్రామంలో మూడురోజుల వ్యవధిలో 16మంది డయేరియా బారిన పడ్డ విషయం విధితమే.

గ్రామంలో కాలువలు మురుగునీటితో నిండి పోయి ఎటు చూసినా చెత్తాచెదారం పేరుకు పోయింది. సుమారు ఏడాదిగా రోడ్లు, కాలువలు శుభ్రం చేయడం లేదని గ్రామస్తులు ప్రజాశక్తికి చెప్పారు. ముఖ్యంగా తాగునీటి పైపు లైన్లు కాలువలకు ఆనుకొని ఉండడం, మురుగు నీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం కారణమని తెలుస్తోంది. ఈ గ్రామానికి చంపావతి నది నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. నది ఒడ్డున గల పారసాం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పంప్‌సెట్ నుంచి దానికి ఎగువ ప్రాంతంలో ఉన్న నెలివాడ మెట్టపై ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకానికి నీరు చేరుతుంది. ఇక్కడి నుంచి నేరుగా బిల్లలవలస సహా 6 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. బిల్లలవలస గ్రామంలోని వాటర్ పైపులైన్లు మురుగునీటి కాలువకు ఆనుకొని ఉన్నాయి. పైప్ లైన్లు అక్కడక్కడ చిట్లిపోయాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఏడాదిగా కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల ఇవి బయట పడలేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు గ్రీన్ అంబాసిడర్‌లలో ఒకరు కొన్నాళ్ల క్రితమే చనిపోయాడు. ఉన్న ఒకే ఒక్క అంబాసిడర్‌కు కూడా సకాలంలో వేతనం ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో పంచాయతీ కార్యాలయానికి సమీపంలో పైప్‌లైన్ ఇటీవల లీక్ అయింది. దానికి ఆనుకుని ఉన్న కాలువలో బురద కూడా ఎక్కువగా ఉంది. ఇక్కడ కొళాయి నీరు తాగే పత్తిగుళ్ళ దీపిక ప్రస్తుతం డయేరియా బారిన పడింది. గ్రామంలోని మరికొన్ని చోట్ల కూడా పైప్ లైన్లు చిట్లు పోయాయని, అందువల్లే కొద్దిరోజులుగా బురద నీరు కూడా వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇలా ఓవైపు పంచాయతీరాజ్, మరోవైపు గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం. ప్రభుత్వ పర్యవేక్షణ కూడా కొరవడం వంటి కారణాలవల్ల ఇక్కడ డయేరియా కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. మరోవైపు గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతోంది. 16 మందిలో 13 మంది కోలుకోగా, మరో ముగ్గురు విజయనగరం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ప్రజలపైకి నెట్టేస్తున్నారు..

డయేరియాకు గల కారణాలను మరోసారి ప్రజలపైకి నెట్టేందుకు వైద్యాధికారులు ప్రయత్నిస్తున్నారు. సంక్రాంతి పండుగలో మాంసం నిలువ చేసి తినడం, పరిశుభ్రత పాటించకపోవడం వంటి కారణాలే డయేరియాకు కారణం కావచ్చుని అధికారులు అంటున్నారు. కాలుల్లో పూడిక తీయాలని, చెత్తాచెదారం లేకుండా చేయాలని గతంలో ఎన్నోసార్లు సర్పంచి, సెక్రటరీలకు చెప్పినా పట్టించుకోలేదు. ఇటీవల గ్రామంలో జరిగిన సమావేశంలో మరోసారి సర్పంచ్ సహా మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

పత్తిగుల్ల ఆది అప్పలనాయుడు, బిల్లలవలస

రిపోర్ట్ రావడానికి సమయం పడుతుంది

బిల్లలవలసలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో గ్రామంలోని నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. రిపోర్టు రావడానికి సమయం పడుతుంది. ప్రస్తుతం రోగులు కోలుకున్నారు. గ్రామంలో కూడా ప్రజారోగ్యం అదుపులో ఉంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

డాక్టర్ జీవన రాణి, డిఎంహెచ్ఓ

డయేరియా రోగితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలి

బిల్లలవలసలో పర్యటించిన సిపిఎం నాయకుల బృందం

ప్రజాశక్తి-బొండపల్లి

బిల్లలవలసలో తీవ్ర అపారిశుధ్యం, పైపులైన్ల లీకేజీల వల్లే డయేరియా ప్రబలిందని, వెంటనే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. డయేరియా బారిన పడిన రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అన్నారు. తమ్మినేని సూర్యనారాయణతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, నాయకులు రాకోటి రాములు, తొత్తడి పైడిపునాయునాయుడు గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతోను, పలువురు రోగులతోను మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా పైపులైన్లను పరిశీలించారు. తాగునీటి పథకం మినీ ట్యాంకు పైపు లైన్లు మురికినీటి కాలువలో ఉన్నందున డయేరియా ప్రబలిందని తెలిపారు. ముందుగా పిహెచ్‌సి వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, డాక్టర్ జి.సమీరాను కలిసి డయేరియా పరిస్థితిని, ఇప్పటివరకు అందించిన వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నిల్వ ఉన్న ఆహారం తినడం వల్లే డయేరియాకు కారణం కావచ్చని వైద్యులు తెలిపారు. తాగునీటి శాంపిల్స్‌ను కూడా అధికారులు తనిఖీకి పంపారని తెలిపారు. దీనికి తమ్మినేని స్పందిస్తూ ఫుడ్‌పాయిజిన్ కావడానికి ప్రజలంతా ఒకేచోట భోజనం చేయలేదని, ఎవరింట్లో వారు తిన్నారని, ఇది సాహేతుకంగా లేదని అన్నారు. తాగునీరు, అపారిశుధ్యం వంటి అంశాలను కూడా పరిశీలించాలని అన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. నీళ్ల ట్యాంకుకు ఆనుకుని ఉన్న కాలువ నీరు పక్కకు వెళ్లే మార్గం లేకపోవడం వలన ట్యాంక్ చుట్టూ నిరంతరం నిల్వ ఉంటుందని, అనేకసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని సిపిఎం నాయకుల వద్ద మహిళలు వాపోయారు. గ్రామానికి నీరు విడిచిపెట్టే పాయింటుకు ఆనుకుని కాలువ ఉందని, ఆ పాయింట్ లీకై నీరు కలుషితం అవుతుందని, ఆ నీరే తాగాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. అనంతరం సిపిఎం నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ ఇరిగేషన్ కాలువలు, గ్రామ కాలువలు ఒకటే అవ్వడం, పూడికతీత చాలా కష్టంగా ఉందని అధికారులు చెబుతున్నారని, ఇది సరైనది కాదని అన్నారు. తక్షణమే తక్షణమే అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. డయేరియా పెరగకుండా చూడాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వారు డిమాండ్ చేశారు.

డోలీ మోతలు లేని గ్రామాలే లక్ష్యం

గిరి శిఖర గ్రామాలకు రహదారులు
గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ



సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

డోలీల మోతలు లేని గిరిజన గ్రామాలే ప్రభుత్వం లక్ష్యమని, ఇందుకోసం గిరి శిఖర గ్రామాలకు రహదారులు వేస్తున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం పెదమేడపల్లి గ్రామంలో పల్లె పండగ సందర్భంగా గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, కాలువలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో రూ.80కోట్లతో సిసి రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వంద రోజుల్లో 102 పనులు పూర్తిచేశామన్నారు. మొదట విడత పనులు పూర్తయితే,రెండవ విడత పనులకు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయి నదులు అనుసంధానం జరిగితే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. పోలీసు శాఖలో ఉద్యోగాలు నియామకాలు జరుగుతున్నాయని, హెల్త్, ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కుంబివలస గిరిజన గ్రామానికి బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, ఆంధ్ర జలాశయంలో చేప పిల్లలు వేసి గిరిజనులకు ఆదుకుంటానని ఆమె హామీ ఇచ్చారు.

సమన్వయంతో పనిచేయండి

పెదమేడపల్లిలో మాజీ జెడ్‌పిటిసి ఇందిర, ఎంపిటిసి ఎర్నాయుడు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు. కలిసి పనిచేస్తే ఒకరిని సర్పంచ్‌గా, ఇంకొకరిని ఎంపిటిసిగా గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, నాయకులు గెద్ద అన్నవరం, ముసలినాయుడు, రెడ్డి ఇందిర, రెడ్డి ఎర్నాయుడు, ఎస్.గురునాయుడు, తాడ్డి తిరుపతి, ఎంపిడిఓ భానుమూర్తి, పిఆర్ జెఇ గౌతం పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరంకోట

వెనుకబడిన విజయనగరం జిల్లాను అభివృద్ధి చేసేందుకు కలసికట్టుగా కృషి చేద్దామని రాష్ట్ర హోంశాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి వంగలపూడి అనిత అన్నారు. టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున అధ్యక్షతన మంగళవారం స్థానిక మోసానికి టెంపుల్‌లో టిడిపి జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అనిత మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో జిల్లాలో జరిగిన అవినీతిని త్వరలోనే వెలికి తీస్తామని, బొత్స కుటుంబంతో అనుబంధం ఉన్న ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో నిరంకుశ పాలన నడిచిందన్నారు. సంవత్సరంలో 365 రోజులు ఉంటే అందులో వంద రోజులు నాయకులు హౌస్ అరెస్టులతోనే గడపవలసి వచ్చిందన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలనూ వైసిపి నేలమట్టం చేసిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేశారని తెలిపారు. అధికారం లోకి వచ్చేలా కష్టపడిన ప్రతి కార్యకర్తనూ టిడిపి గుర్తిస్తుందని తెలిపారు. రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్రాంతి కి ముందే గ్రామాల్లో రోడ్లు వేయడంతో పల్లె ప్రజల్లో ఆనందాలు వెల్లువిరుస్తున్నాయన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు జిల్లాకు జీవనాడి అన్నారు. నాయకులంతా వారంలో ఒకరోజు పార్టీ కార్యకర్తల కోసం సమయం కేటాయించాలన్నారు.

కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి పతివాడ, ఇన్‌ఛార్జి మంత్రి అనిత

పోలవరం ప్రాజెక్ట్ మూడవ దశలో జిల్లాకు నీరు అందించడానికి కృషి చేస్తామన్నారు. తోటపల్లి తాటిపూడి మడ్డువలస డ్యాముల ద్వారా నీటిని తెప్పించి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగం బాగా పెరిగిపోయిందని హోంమంత్రికి వివరిస్తూ నియంత్రణకు పోలీస్ శాఖ ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికల్లో ఏ పంచాయతీని వదలకుండా గెలవడానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నెల 23న నారా లోకేష్ జన్మదినం సందర్భంగా భారీ రక్తదాన శిబిరాలు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. అందుకు తానే ఒక ఉదాహరణ అని తెలిపారు. లోకేష్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర 2047 నాటికి సాకారం అవుతుందని దానికి మనమంతా తోడ్పాటు అందించాలని కోరారు. పార్లమెంట్ నిధులను అన్ని నియోజకవర్గాలకు సమానంగా ఇస్తానన్నారు. జిల్లా పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు , కోళ్ల లలిత కుమారి, కోండ్రు మురళీమోహన్, పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మాజీమంత్రి, స్టేట్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే పతివాడనారాయణస్వామి నాయుడు, కొండపల్లి అప్పలనాయుడు, ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు, మాజీ జిల్లా అధ్యక్షులు మహంతి చిన్నం నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు , వివిధ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఒకరోజులో రాష్ట్రంలో కోటి సభ్యత్వాలు పూర్తి చేసిన నేపథ్యంలో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు చేతులమీదుగా కేక్ కట్ చేయించారు.

వీడియో పాఠాల ద్వారా అక్షరాస్యత

రెండోవిడత శిక్షణా కార్యక్రమంలో వయోజన విద్య డిడి సోమేశ్వర్రావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అక్షరాస్యతను పెంపొందించేందుకు వీడియో పాఠాలను వినియోగించాలని జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యుటీ డైరెక్టర్ సోమేశ్వర్రావు సూచించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒలకు, వెలుగు ఎపిఎంలకు, రీసోర్స్ పర్సన్లకు రెండోవిడత శిక్షణా కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. టిసిఎస్ రూపొందించిన వీడియో పాఠాలను బోధించే విధానాన్ని పవర్ పాయింట్ ద్వారా వివరించారు. డిడి సోమేశ్వర్రావు మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 48,578 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు త్వరలో బోధన మొదలు కాబోతుందని చెప్పారు. దీనికోసం ఇప్పటికే 4,857 మంది వలంటీర్ టీచర్లను గుర్తించి, వారిని మ్యాపింగ్ చేశామన్నారు. అక్షరాస్యతను పెంపొందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించాలని విద్యాహక్కు చట్టం-2020లో ఉందని, దాని ప్రకారం టిసిఎస్ ద్వారా ప్రత్యేకంగా వీడియో పాఠాలను రూపొందించామని తెలిపారు. 23న మండల స్థాయిలో విటిలకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. అక్షరాస్యత అన్నది సేవాకార్యక్రమంగా గుర్తించి, విజయవంతం చేయాలన్నారు. వయోజనవిద్య ఎపిఒ లక్ష్మి మాట్లాడుతూ ఫంక్షనల్ లిటరసీ గురించి వివరించారు.

మార్చి నాటికి ఒడిఎఫ్ జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మార్చి నెలాఖరుకి జిల్లాను ఒడిఎఫ్ గా తీర్చిదిద్దాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. దీనికోసం మండలాల వారీగా ప్రణాళికను రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. ఒడిఎఫ్‌పై తమ ఛాంబర్లో మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలోని ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇలకు పలు ఆదేశాలను జారీ చేశారు. జిల్లాలోని 925 గ్రామ పంచాయితీల్లో ఇప్పటికే 74 గ్రామాలను ఒడిఎఫ్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఈ గ్రామాల్లో శతశాతం కార్యకలాపాలు జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని మిగిలిన అన్ని గ్రామాలను దశలవారీగా ఒడిఎఫ్ మోడల్ విలేజ్‌గా మార్చేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. అర్హత ఉండి అవసరమైన వారికి వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తామన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల సమగ్ర నిర్వహణతోపాటు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కూడా ఉండాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి డిపిఒ టి.వెంకటేశ్వర్రావు, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కవిత పాల్గొన్నారు.

సచివాలయాన్ని మార్చే అధికారం ఎమ్మెల్యేకు ఎవరిచ్చారు?

●సోమవారం లోగా చర్యలు తీసుకోకుంటే పోరాటం ● జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులూ లేకుండా బానాది గ్రామ సచివాలయాన్ని రైతు భరోసా కేంద్రానికి మార్చే అధికారం ఎమ్మెల్యేకు ఎవరిచ్చారని జెడ్‌పి చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. జెడ్‌పి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజకీయ పరిపాలన సాగుతోందన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం నిర్వీర్యం అయిపోయిందన్నారు. వేపాడ మండలం బానాదిలో గత ప్రభుత్వం నిర్మించిన గ్రామసచివాలయం, రైతు సేవా కేంద్రంలో ఫర్నిచర్‌ను ఎంమ్మెల్యే లలిత కుమారి తరలించుకు పోయి ప్రైవేట్ భవనంలో కార్యాలయాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ భవనాలను ఎలాంటి అనుమతులు లేకుండా ఖాళీ చేస్తుంటే జిల్లా కలెక్టర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతు సేవా కేంద్రం లోని టివి, కియోస్క్, ప్రచార సామగ్రి మాయం చేశారన్నారు. బానాదిలో మహిళా సర్పంచ్‌ను ప్రభుత్వ అధికారులు పట్టించుకోకుండా గ్రామ కార్యాలయాలు తరలించుకు పోయారన్నారు. ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు.వచ్చే సోమవారం నాటికి యథాస్థితి లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. మరో వైపు జిల్లాలో ప్రజాప్రతినిధులకు,అధికారులకు మధ్య సంబంధం లేకుండా పరిపాలన సాగుతుందన్నారు. గత ప్రభుత్వంలో తాటిపూడిలో బోటు షికారు కోసం కోటి రూపాయిలు నిధులు కేటాయించిందని, ఇటీవల మంత్రి ప్రైవేటు కార్యక్రమం మాదిరి ప్రారంభించారన్నారు. ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి వెళితే ప్రజలు బాధలు తెలుస్తాయన్నారు. సమావేశంలో ఆ గ్రామ సర్పంచ్, వైసిపి వేపాడ మండల నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరుగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు ప్రజలను కోరారు. మహాసభల సందర్భంగా సిపిఎం విశిష్ట నిధి కోసం చేపట్టిన ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా మంగళవారం రామకృష్ణ నగర్‌లో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పట్టణ ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో 2005 రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేసి ఇళ్లు సాధించుకున్నామని తెలిపారు. అప్పుడున్న చెత్త పన్ను, రద్దు చేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా పోరాడిన చరిత్ర కలిగిన పార్టీ అని, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, మహిళలు చేస్తున్న పోరాటాలకు అన్ని రకాల మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.శాంతమూర్తి, ఎం.జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని పెరుమాలి, జగన్నాథవలస గ్రామాల్లో డాక్టర్ జె నరేంద్ర కుమార్, డాక్టర్ ఈ అరుణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పశుఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 63 పశువులకు సాధారణ చికిత్సలు, 34 పశువులకు గర్భ కోశ వ్యాధి చికిత్సలు, 5 పశువులకు కృత్రిమ గర్భధారణ, పెద్ద పశువులకు, దూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. 550 కోళ్లకు టీకాలు వేశారు. 110 మంది పాడి రైతులకు లబ్ధి చేకూరిందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ 2017-18 సంవత్సరంలో చనిపోయిన 243 ఆవులు, గేదెలు, 8 గొర్రెలకు ఎల్ఎస్ఐఎస్ పథకం ద్వారా రూ.80.70లక్షలు సంక్రాంతి ముందు రోజు పాడి రైతుల ఖాతాల్లో ఇన్సూరెన్స్ రూపంలో జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జి.వెంకట్రావు, అప్పల నరసింహరాజు, నాయకులు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. పట్టణంలో శ్వేత చలపతి పాఠశాల రోడ్డు, తాండ్రపాపారాయ బొమ్మ, మెయిన్ రోడ్డు మార్కెట్, మంగలివీధి ప్రాంతాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని, రోడ్లు, కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చెత్త వేసిన వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఆమెతో శానిటరీ ఉద్యోగులు ఉన్నారు.

చెట్లు నరికివేతకు వేలం పాట

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు పంచాయతీలో తాగునీటి కోనేరు చుట్టూ ఉన్న నీలగిరి చెట్లను నరికి వేతకు సర్పంచ్ వెంకటలక్ష్మి, రమణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో 32 మంది పాల్గొనగా పినిశెట్టి వెంకనాయుడు రూ.4.50లక్షలకు పాడుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.50వేలు డిపాజిట్ చేయాలని నిబంధన మేరకు నెల రోజుల్లో పాట సొమ్మును పంచాయతీకి జమ చేయాలని తెలిపారు. ఈ వేలం పాటలో మండల పంచాయతీ విస్తరణ అధికారి మహేష్ పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తల్లి దండ్రుల పేరిట దేవాలయ నిర్మాణానికి దాత ఆర్థిక విరాళం అందజేశారు. మంగళవారం తంగుడుబిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శివకు బంగార్రాయ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బొండపల్లి మండలం జి.గుమడాంలో నిర్మిస్తున్న శ్రీ సత్యదేవ సంపత్ వినాయక దేవాలయానికి 20 సిమెంట్ బస్తాలు నగదును ఆలయ నిర్మాణ కమిటీకి అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ మాస్టారు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని అభినందించారు.

డిఆర్‌పేట పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఇఒ జి.జగదీశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు హాజరు పట్టిక, మధ్యాహ్నం భోజనం, పాఠశాల ఆవరణ విద్యార్థులు డైరీలు నోట్ బుక్స్, వర్క్ బుక్స్ పరిశీలించారు. ఈ పరిశీలనలో సిఆర్‌పిలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో ఉన్న హేండ్ ఇన్ హేండ్ సంస్థ కేంద్రాన్ని, కారాడలో ఉన్న సన్‌రైజ్ కేంద్రాన్ని మంగళవారం జిల్లా బాలల సంరక్షణ కమిటీ సభ్యులు సత్యనారాయణ, విజయలక్ష్మి, విజయ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక సౌకర్యాలు, డాక్యుమెంటరీను పరిశీలించారు. బాలల హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు.

అవగాహనతోనే క్షయ నియంత్రణ

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రజలకు అవగాహనతోనే క్షయవ్యాధి నియంత్రణ సాధ్యమని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల వీరభద్రపురం సచివాలయంలో వంద రోజులు టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాంలో భాగంగా సర్పంచ్ గేదెల త్రినాథ మూర్తి, రాములమ్మ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ ఎల్.సత్యారావు మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, జ్వరం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా నిర్ధారణ చేయవచ్చునని తెలిపారు. ప్రజలలో అవగాహన పెరిగితేనే నియంత్రణ సాధ్యమని, క్రమం తప్పకుండ మందులు వాడితే టీబీ వ్యాధి నయమవుతుందని తెలిపారు. టీబీ నియంత్రణకి ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్.ఎల్.హెచ్.పి. అనూష రాణి, ఏ.ఎన్.ఎమ్. సత్యవతి, ఆశ వర్కర్స్ వెంకటలక్ష్మి, ఎర్ణమ్మ, గౌరీ, లీలాకుమారి, అంగన్వాడీ వర్కర్స్, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధిలోని గుండాలపేటలో పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, ఎంఎల్‌హెచ్‌పి, ఆషా వర్కర్లకు తగు సూచనలు చేశారు. ప్రతి 14 రోజులకు ఇంటిలార్వ మందులు స్ప్రేయింగ్ చేయించే విధంగా చూడాలన్నారు. రానున్న వేసవికాలం దృష్ట్యా నీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మలవిసర్జన జరగకుండా విజిలెన్స్ టీమ్‌లు ఏర్పాటు చేసి ప్రజారోగ్యం కాపాడాలన్నారు. పెదతాడివాడ ఎస్‌డబ్ల్యుపిసి పరిశీలించి పూర్తి స్థాయిలో ఫంక్షన్ ఇంగ్‌లోకి తీసుకురాలన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ అప్పలస్వామి పాల్గొన్నారు.

జెడ్‌పి సిఇఒకు రాజీనామా పత్రం అందజేత

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం వైస్ ఎంపిపి పడాల సత్యవతి తన పదవికి రాజీనామా చేస్తూ జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణకు రాజీనామా లేఖను మంగళవారం అందజేశారు. సోమవారమే రాజీనామా చేసిన లేఖను ఎంపిడిఒ గాయత్రికి ఆమె అందజేసిన విషయం తెలిసిందే. కానీ నిబంధనల మేరకు ఎంపిపి, వైస్ ఎంపిపి పదవులకు రాజీనామా చేసేటప్పుడు రాజీనామా లేఖను జిల్లా పరిషత్ సిఇఒకు అందజేయాలని అందుకు ఆమె మరోసారి విజయనగరం జిల్లా పరిషత్‌లో సిఇఒకు రాజీనామా లేఖను అందజేశారు. జనసేన నాయకులు పడాల శ్రీనివాసరావు, అడ్డగర్ల వెంకట్రావు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి అరుణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మంగళవారం ఇంప్లాంట్ ట్రైనింగ్, ప్లేస్మెంట్‌పై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అరుణ మాట్లాడుతూ పిల్లలకు స్టానిక/స్టానికేతర అన్న భేదం పెట్టుకోకుండా మంచి పరిశ్రమలు అవకాశం కల్పించినపుడు చొరవ తీసుకొని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు. టాటా స్ట్రయివ్ , సీమెన్స్ డ్యూయల్ వొకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్‌లో ఈ ఐటిఐ ని భాగస్వామిని చేసి శిక్షణలో తోడ్పాటు అందిస్తున్నట్లు ఆ సంస్థ నుండి వి.సంతోష్ కుమార్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ తెలిపారు. సమావేశంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ టివి గిరి మాట్లాడుతూ పరిశ్రమలో ఈ శిక్షణా కాలంలో స్టయిఫండ్ కూడా ఇవ్వడం వలన విద్యార్థులకు ఆర్థిక భారం కూడా ఉండదన్నారు.

ప్రతి పంచాయతీకి మోడల్ ప్రైమరీ పాఠశాల

- యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు డిమాండ్
- జిఒ 117 సవరణపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు

ప్రజాశక్తి - జామి

జిఒ నెంబర్ 117 సవరణ చేసి, ప్రతి పంచాయతీకి మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయాలని ఫౌండేషన్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదనలు చేయడం సరియైనది కాదని, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపోట్స్ పెరుగుతారని ఇటువంటి ప్రతిపాదనలు ప్రభుత్వం మానుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఎఆర్కే ఈశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా యుటిఎఫ్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా జామి ఎంఇఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవో 117 రద్దు చేయాలని యుటిఎఫ్ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేసి, ఇద్దరు టీచర్లు ఉండేలా నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఫౌండేషన్ పాఠశాల పాఠశాల ప్రతి పాదనను విరమించు కోవాలి డిమాండ్ చేశారు. అంతకు ముందు ఎంఇఒలు జయశ్రీ, గంగరాజులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమలో నాయకులు తాతంనాయుడు,వాసుదేవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: ప్రతి గ్రామపంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలని, ఇంగ్లీషు, తెలుగు మీడియం రెండింటినీ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం ఎంఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఫౌండేషన్ పాఠశాలల ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, రామకృష్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజయ్య, శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎన్.సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయనగరం: ఎంఆర్‌సి వద్ద నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద యుటిఎఫ్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ గ్రామ పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5 తరగతులుండాలని, ఫౌండేషన్ పాఠశాలల ప్రతిపాదనను విరమించుకోవాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, మండల శాఖ అధ్యక్షులు నడిపేన బలరాం, సహాధ్యక్షులు చింత రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి దువ్వాడ కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు నాగులపల్లి శంకరరావు, మాతా తిరుపతిరావు, జిఆర్‌కెఎస్ రాజు, ముంగంటి నాగేశ్వరరావు, పిళ్ళా బంగారు నాయుడు, జి.చంద్రమీశ్వరరావు, కేఎల్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఉండాలని, యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటియఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రం వద్ద మంగళవారం ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ధర్నా అనంతరం యంఆర్‌సి సిబ్బంది వేణుకి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు కె.అప్పారావు, పి.రాంప్రసాద్, ఆర్.రామునాయుడు, యన్.ధనంజయరావు, జే వెంకటరావు, వెంకటరమణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ప్రతీ గ్రామ పంచాయతీలో ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘ నేతలు స్థానిక ఎంఆర్సీ భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి విజయగౌరి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 1-5 తరగతులు ఉండాలని, ఫౌండేషన్ పాఠశాల ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శి కేశవరావు, మండల అధ్యక్షులు సుధాకరరావు, వెంకటరావు, త్రినాథరావు, జ్యోతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.**పూసపాటిరేగ:** ప్రతి పాఠశాలలో 1 నుండి 5 తరగతులు నిర్వహించి, ఫౌండేషన్ పాఠశాలల ప్రతిపాదన విరమించుకోవాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం ఎంఇఒలకు

జామి: మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్, మండల అధ్యక్షుడు వైకుంఠ రమణ, ప్రధాన కార్యదర్శి గంగాధర్, గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ నాయుడు, మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తవలస: విద్యారంగంలో జిఒ 117ను సవరించాలని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్. నిర్మలదేవి, జి.విజయగౌరీ, జిల్లా నాయకులు జి.పార్వతి, జి.వెంకటనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఆర్‌సి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల దాదాపుగా ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన భాద్యులు ఎన్. ఎస్.ప్రసాద్, వి.సురేష్‌కుమార్, పి.కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: గత ప్రభుత్వం విద్యాశాఖలో అమలు చేసిన జిఒ నెంబర్ 117ను సవరణ చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిన మెమోలో కొన్ని అసంబద్ధాలను సరిచేయాలనీ యుటిఎఫ్ నాయకులు స్థానిక ఎంఆర్‌సి వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి రమణ, పాల్గొన్నారు.

శృంగవరపు కోట: యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గూనూరు వెంకట రావు ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సి వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం ఎంఇఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జివి రమణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇప్పుడు జిఒల అవసరం వచ్చిందా?

జెడ్‌పి చైర్మన్‌ను ప్రశ్నించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో ప్రజా ధనంతో నిర్మించిన పంచాయతీ భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని సామాగ్రిని పాడుబడిన భవనంలోకి తరలించినపుడు జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు జిఒలు గుర్తుకు రాలేదా అని టిడిపి నియోజకవర్గ నాయకులు గుమ్మడి సంధ్యారాణి, బానాది ఎంపిటిసి గొంప తులసి ప్రశ్నించారు. సచివాలయం సిబ్బందిని సమాచారం లేకుండా వేరే భవనంలోకి మార్చడం పట్ల జెడ్‌పి చైర్మన్ తప్పుబట్టిన విషయాన్ని టిడిపి ఎదురు ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏ విధమైన జీవోతో పాడుబడిన ఇరికి గదిలోకి సిబ్బందిని తరలించారో జిల్లా పరిషత్తు చైర్మన్ చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవతో ప్రైవేట్ స్థలంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ప్రభుత్వ స్థలంలో ప్రజాధనంతో నిర్మించిన భవనంలోకి విధులు నిర్వహించడానికి తీసుకురావడం నేరమా అని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా తాను ఉన్నంతం కాలం తాను చెప్పినట్లే చేయాలని అధికారులపై ఒత్తిడి

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

తీసుకురావడం ఎంత వరకూ సమంజసమన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు యోగక్షేమాలే ముఖ్యమని ఈ విషయంలో న్యాయస్థానానికి వెళ్లడానికైనా తాము సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ గొర్ల నాగరాజు, అడ్వకేట్ గుమ్ముడు రవి కుమార్, మండల ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, సిహెచ్ రమణ, ఎన్ బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సంకల్పం'తో వ్యసన విముక్తులు కావాలి

రూరల్ సిఐ నారాయణరావు

ప్రజాశక్తి - రామభద్రపురం

సంకల్ప బలంతో వ్యసనాల నుంచి విముక్తులు కావాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు నూతన పోలీసు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మాదక ద్రవ్య వినియోగం పెరిగిందని దీనిపై పోలీసులు ఉక్కు పాదం మోపి పూర్తిగా అణచి వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ఫలితాలను సదస్సులు నిర్వహించి సంకల్పం అనే కార్యక్రమం ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థి దశ నుంచే వీటిపై అవగాహన పెంచుకొని ఇంట్లో పెద్దలకు, నిరక్షరాస్యులకు వివరించాలని సూచించారు. సైబర్ క్రైమ్ బాధితులుగా ఎవరూ నమోదు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈవ్ టీజింగ్ నేరాలకు పాల్పడిన వారిపై తీసుకొనే క్రిమినల్ చర్యలు, వాటికి విధించే శిక్షలు వివరించారు. రహదారి భద్రతా నియమాలు, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. నూతన చట్టాల అమలకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహరించాలని కోరారు. అనంతరం సంకల్ప కార్యక్రమం ద్వారా ప్రజల్ని చైతన్యవంతులను చేసేందుకు ఉపకరించే వీడియోలు ప్రదర్శించి చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కామేశ్వరరావు, సిబ్బంది రఘురాం నాయుడు, దాలినాయుడు పాల్గొన్నారు.

పదవుల్లో ప్రాధాన్యతివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

తూర్పు కాపులకు నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత కల్పించాలని తూర్పు కాపు సామాజిక వేదిక జిల్లా అధ్యక్షులు అంబళ్ల అప్పలనాయుడు అన్నారు. మంగళవారం కామాక్షి నగర్ తూర్పుకాపు సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పు కాపులకు తామాషా ప్రకారం నామినేటెడ్ పదవులు ఇచ్చి వారి హక్కులను కాలరాయ కుండా ఇవ్వాలన్నారు. తూర్పు కాపు సామాజిక వేదిక మాజీ అధ్యక్షులు రొంగలి రామారావు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారన్నారు. ఎన్నికల్లో ప్రాధాన్య తగ్గించి సీట్లు ఇచ్చినప్పటికీ కూటమి విజయానికి కృషి చేశామన్నారు ఈ దఫా ఇస్తున్న నామినేటెడ్ పదవులైన తూర్పు కాపులకు కేటాయించాలని అన్నారు. తూర్పు కాపులను అనగదొక్కే ప్రయత్నం చేయకూడదు కోరారు. సమావేశంలో జిల్లా ట్రెజరర్ పత్తిగిల్లి రామారావు, తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గిరడ అప్పలనాయుడు, ముఖ్య సలహాదారు పిన్నింటి సూర్యనారాయణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మొదిలి నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం కృషి ఫలితమే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

సిఎం చంద్రబాబు కృషి ఫలితమే విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు ఆర్థిక సహాయాన్ని ప్రకటించిందని ఎమ్మెల్యే బేబినాయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకు నేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసిందని, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. వైసిపి నిర్లక్ష్యం వల్లనే స్టీల్ ప్లాంట్‌కు నష్టాలు వచ్చాయన్నారు. వాజ్‌పేమ్ ప్రధానిగా ఉన్న సమయంలో అప్పటి కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రంనాయుడు చొరవతో 1998లో రూ.1650 కోట్లు స్టీల్ ప్లాంట్‌కు తీసుకు వచ్చారని గుర్తు చేశారు.

భోగాపురం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడిన ఘనత కూటమిదేనని ఎపి రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ఆస్తులను జగన్మోహన్ రెడ్డి అమ్ముకోవాలని ప్రయత్నిస్తే దానిని ఏ విధంగా కాపాడాలని ఆలోచించిన వ్యక్తి చంద్రబాబు నాయుడని అన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన స్టీల్ ప్లాంట్‌కు నిధులు తెప్పించడంలో కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు.

మౌలిక సౌకర్యాలకు రూ.1450 కోట్లు

గురుకులాల ఇన్‌ఛార్జి సెక్రటరీ మస్తానయ్య

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు గత నాలుగేళ్లలో ప్రభుత్వం రూ.1450 కోట్లు కేటాయించినట్లు గురుకుల పాఠశాల ఇంచార్జి సెక్రటరీ విఎన్ మస్తానయ్య అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో క్రీడా మైదానాలు, ల్యాబ్, ల్యాబ్ పరికరాలు, ర్యాంపులు ఏర్పాటుకు నాలుగేళ్లలో రూ.1450 కోట్లు కేటాయించిందని, గతేడాది రూ.177 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు 50, జూనియర్ కళాశాలలు 10, ఒక డిగ్రీ కళాశాల ఉందని చెప్పారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధనకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని చెప్పారు. మెగా డిఎస్‌సి ద్వారా గురుకుల పాఠశాలలో 190 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ప్రతిపాదనలు చేశామన్నారు. బొబ్బిలి గురుకుల పాఠశాలలో డార్మెంటరీలను బాగు చేసేందుకు రూ. 1.22 కోట్లతో ప్రతిపాదనలు చేశామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా డార్మెంటరీలు కోసం రూ.109కోట్లతో ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

గురుకుల పాఠశాల పరిసరాలను పరిశుభ్రం

పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఇంఛార్జీ సెక్రటరీ మస్తానయ్య

చేయాలని ప్రిన్సిపాల్ రఘునాథ్‌ను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పనికి రాని చెట్లను కమిటీ తీర్మానంతో తొలగించాలని కోరారు. డార్మెంటరీలను బాగు చేసేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. స్టాఫ్ రూమ్ బాగు చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టాఫ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రైతుల ధాన్యం అగ్గిపాలు

రూ.4లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని మామిడిపల్లి కల్లాల వద్ద సంభవించిన అగ్ని ప్రమాదంలో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతులు శ్రీను, కుమార్, ఈశ్వరరావు, అప్పలనాయుడు, సన్నీ బాబు, కాసులమ్మ, ఈశ్వరమ్మ, భవానీలు తమ పండించిన ధాన్యాన్ని పురులు వేసి కల్లాల వద్ద దాచుకున్నారు. సోమవారం రాత్రి పది గంటల సమయంలో వీటికి నిప్పు అంటుకుంది. దీంతో ఒక్కసారిగా ఈ పురులు అగ్నికి ఆహుతయ్యాయి. వెంటనే స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చే లోపే నష్టం జరిగిపోయింది. ఎనిమిది పురుల్లో ఉన్న సుమారు 160 నుంచి 200 వరకు ధాన్యం బస్తాల కాలిపోయాయి. వీటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ ఎఇఒ నాయుడును వివరణ కోరగా తనకు ఈ విషయం పూర్తిగా తెలియదని చెప్పడం విశేషం. రైతు సేవ కేంద్రం వద్ద ఉంటే రైతులు వచ్చి చెప్పారని తెలిపారు. ఎంతమేర ధాన్యం కాలిపోయింది ఎంత నష్టం జరిగింది తనకు తెలియదని రెవెన్యూ శాఖ వారు ఆస్తి నష్టం వేస్తారని తెలిపారు. ఈ విషయంపై గ్రామ యువత మాట్లాడుతూ రైతుల ధాన్యం గురించి తెలియని వ్యవసాయ శాఖ అధికారి తమకు రావడం చాలా బాధ కలిగించిందన్నారు. రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదవశాత్తు యువకుడు మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కేజీపూడి పంచాయతీ పరిధిలో గల దెబ్బ పాలెం గ్రామం వద్ద ఎల్ కోట మండలం కళ్లేంపూడి గ్రామానికి చెందిన వై శేఖర్(20) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. శేఖర్ ప్రతిరోజు చెట్లు నరకడానికి కూలి పనికి వెళ్లి వచ్చిన ఆదాయంతో తల్లిదండ్రులను పోషించుకునే వాడు. ఎప్పటి మాదిరిగానే మంగళవారం కేజీపూడి పంచాయతీ పరిధిలో గల దెబ్బపాలెం వద్ద చెట్లు కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మ మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కేజీ పూడి వెల్నెస్ సెంటర్‌కు వైద్య సేవలు నిమిత్తం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వల్లంపూడి ఎస్ఐ బి.దేవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అవివాహితుడుగా ఉన్న శేఖర్ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. తండ్రి కృష్ణ, తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహన్ని ఎస్‌కోట ఏరియా ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించామని ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ప్రజాశక్తి-బొబ్బిలి

మల్లమ్మపేటలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఐదుగురుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి పడుకుని ఉన్న భవన నిర్మాణ కార్మికుడు రఘుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఒక చిన్నారి, మరో ముగ్గురుపై దాడి చేసి గాయపరచడంతో స్థానికులు భయభ్రాంతులకు గురై కుక్కను చంపేశారు. గాయపడ్డ ఐదుగురు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. మున్సిపాలిటీ సిబ్బంది కుక్కలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం సీసాలతో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస ఎక్సైజ్ సిఐ జిఎస్ రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో వేపాడ మండలం బల్లంకి గ్రామానికి చెందిన ఎం.రామును 12 మద్యం సీసాలతో అరెస్టు చేశామన్నారు. లక్కవరపుకోట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఒక మహిళను 15 మద్యం సీసాలతో అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఎన్.రమ్యశ్రీ, విఎన్ రాజు, సిబ్బంది హెచ్‌సి బి రాముడు, ప్రసాద్, బి.ఆదినారాయణ, జి రమేష్, వి పుష్పలతలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ

విజయనగరం టౌన్: ఈనెల 16, 17వ తేదీల్లో ప్రకాశం జిల్లా పొదిలిలో జరిగిన 28వ జూనియర్ సెపక్ తక్రా రాష్ట్రస్థాయి బాల, బాలికల పోటీల్లో విజయనగరం జిల్లా బాలికలు యు.కావ్యాంజలి, కె.అశ్వని, రీతుసాయి. పవిత్ర , ఎస్.చాందిని ప్రతభ కనబరిచారు. 16 జిల్లా జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో విజయనగరం బాలికల జట్టు 3వస్థానం కైవసం చేసుకుంది. విజేతలకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సి.హెచ్ వేణుగోపాలరావు, సెపక్ తక్రా కార్యదర్శి ఎంటి రాజేష్, ట్రెజరర్ పి.భవాని అభినందించారు.

వాహన చోదకులకు అవగాహన

విజయనగరంకోట: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహన దారులకు రవాణాశాఖ ఆధర్యంలో భద్రతా నియమాలపై స్థానిక సంతకాల వంతెన వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని కోరారు. భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని సూచించారు. ప్రతీఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, నియమాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఉప రవాణా కమిషనర్ డి.మణికుమార్, ఆర్‌టిఒ జి.విమల, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ ఎం.మురళీకృష్ణ, యు.దుర్గాప్రసాద్, పి.శివరాంగోపాల్, పాల్గొన్నారు.

ప్లాట్ల అమ్మకాలు ఆపాలని ధర్నా

విజయనగరం టౌన్ : ఎస్ఎల్ఎస్ జ్యూట్ మిల్స్ (అరుణా జ్యూట్‌మిల్లు) ఫుల్ అండ్ ఫైనల్ అగ్రిమెంటు ప్రకారం కార్మికులకు ఇంకా పిఎఫ్ స్టాఫ్ గ్రాట్యూటీ, సిక్ లీవులు యాజమాన్యం చెల్లించకుండా పరారైపోయినందున ఈ మిల్లు స్థలాలు అమ్మకాలు కొనుగోలును నిషేధించాలని డిమాండ్ చేస్తూ అరుణ జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ఆధ్వర్యాన మిల్లు మెయిన్‌గేటు వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు శంకర్రావు మాట్లాడుతూ కార్మిక బకాయిలు క్లియర్ కాకుండా సురభి అర్బన్ వన్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ ఏ విధంగా కొన్నదని కార్మికులు ప్రశ్నించారు. సురభి అర్బన్ వన్ కంపెనీ మిల్లు స్థలాలు అమ్మకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆ సంస్థ ఎమ్‌డి కెవిఆర్‌పై కోర్టు జారీ చేసిన ఎన్‌బిడబ్ల్యు వెంటనే అమలు చేయాలని, కలెక్టర్ సమక్షంలో ఎస్ఎల్ఎస్ యాజమాన్యం, సురభి అర్బన్ ప్రతినిధులు, పిఎఫ్ అధికారులు, లేబర్ కమిషనర్ యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ వేయాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ చందక శ్రీనివాసరావు కార్మికులకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, బి.అప్పారావు, ఆర్ ప్రకాష్ రావు, మద్ది అప్పలరాజు పాల్గొన్నారు.

యువకుడు మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని పెనసాం గ్రామానికి చెందిన మీసాల రమణమూర్తి(31) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రమణమూర్తి అచ్చుతాపురంలోని ఒక ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు మద్యానికి బానిసైన అతను సంక్రాంతికి ఇంటికి వచ్చి ఈ నెల 19న స్థానిక జీజే కాలేజ్ వెనక మామిడి తోటలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన వివాహిత గరుగుబిల్లి ఆదిలక్ష్మి (40) కడుపు నొప్పి తాళలేక మంగళవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మతురాలి తండ్రి గుర్ల మండలం కెల్ల గ్రామానికి చెందిన కెల్ల సూరప్పడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. తన కుమార్తె ఆదిలక్ష్మి గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ మంగళవారం అత్త వారిళ్లు కొండగుంపాంలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యా యత్నం చేసుకుందన్నారు. వెంటనే గమనించి అల్లుడు గరుగుబిల్లి లక్ష్మణరావు కొనఊపిరితో ఉన్న ఆదిలక్ష్మిని చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారని చెప్పారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బి.గణేష్ తెలిపారు.